స్పెషల్ డే.. స్పెషల్ రైస్

- మార్కెట్‌లో కొత్త ఫ్లేవర్లతో సరికొత్త బియ్యం
- సువాసనతోపాటు రుచి కూడా..
- ప్రత్యేక రోజుల్లో వండేందుకు ప్రజల ఆసక్తి

సండే స్పెషల్



భద్రాచలంలోని ఓ దుకాణంలో అమ్మకానికి ఉన్న వివిధ రకాల బియ్యం బ్యాగులు

భద్రాచలంఅర్బన్: ఆదివారం వచ్చిందంటే.. ఇంట్లో బిర్యానీ గుమగుమలు, నాన్వెజ్, మసాలా రుచి నాలుకకు తగలాల్సిందే. అయినవారు, స్నేహితులతో కలిసి దావత్ చేసుకోవడానికి ఏ రకమైన బియ్యం వాడాలని ఆలోచిస్తుంటారు. ఈ క్రమంలో వివిధ కంపెనీలు కొత్త ఫ్లేవర్స్, సరికొత్త రకాల బియ్యాన్ని మార్కెటింగ్ చేస్తున్నాయి. నవతరం అభిరుచులకు తగ్గట్టుగా వస్తున్నాయి.

రొటీన్‌కు భిన్నంగా..

ప్రజలు రొటీన్‌కు భిన్నంగా ఆహార రుచులను ఆస్వాదిస్తున్నారు. ప్రత్యేక రోజుల్లో తీసుకునే ఆహారంలో కొత్తదనం కోరుతున్నారు. ఈ నేపథ్యంలో సాధారణంగా పంట బియ్యం, సోనామసూరి, బాస్మతి వంటివి అందరికీ తెలిసినవే. ప్రస్తుతం మార్కెట్లో వీటికి భిన్నంగా సాధారణ రైస్లో స్ట్రీమ్ రైస్, రారైస్, బ్రౌన్ రైస్ వచ్చాయి. హెచ్ఎంటీ, ఆర్ఎన్ఆర్, జేఎస్ఆర్, చింట్లు, క్వీన్ అఫ్ పంజాబ్, యూనిటీ, ఇండియా గేట్, తదితరాలు భద్రాచలంలో లభ్యమవుతున్నాయి. వీటిని కేజీ ప్యాకెట్ నుంచి 25 కిలోల వరకు విక్రయిస్తున్నారు.

రుచికరం.. ఆరోగ్యం..

పాతకాలంలో పెద్దలు పంట ధాన్యాన్ని దంచి, బియ్యంగా మార్చి తినేవారు. తర్వాతి కాలంలో గిర్నీల్లో పట్టించి, ఉనుక, తవుడులను వేరు చేసి, బియ్యాన్ని తీసేవారు. ప్రస్తుతం బియ్యం రెడిమేడ్ వస్తువుగా లభిస్తున్నాయి. అవి బ్రాండెడ్ అన్ బ్రాండెడ్ రకాల్లో వస్తున్నాయి. సరికొత్త రకాల్లో వస్తున్న బియ్యంతో రుచితోపాటు ఆరోగ్యాన్ని పొందవచ్చన్న నమ్మకాన్ని ఆయా కంపెనీలు కల్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలో భద్రాచలం పట్టణంలోనూ ఇటువంటి బియ్యానికి ఆదరణ పెరుగుతోంది. పట్టణంలోని కేఎస్ఆర్ మార్ట్‌తో పాటు అన్ని సూపర్ మార్కెట్లు, రైస్ డిపోల్లో వివిధ రకాల బియ్యాలు అందుబాటులో ఉన్నాయి.

బాస్మతీ కన్నా బెటర్..



సండే వచ్చిందంటే కామన్‌గా అందరూ నాన్వెజ్, బిర్యానీ కోరుకుంటారు. అయితే బాస్మతి రైస్‌తో చేసే బిర్యానీ వంటకాల్లో నూనె ఎక్కువ వాడాలి. కానీ, ఇప్పుడు వస్తున్న కొత్తరకం బియ్యానికి తక్కువ నూనె వాడొచ్చు. కొత్త రకాల బియ్యంతో అన్నం సువాసనతోపాటు టేస్టీగా ఉంటోంది.

– రాజ్యలక్ష్మి, మెడికల్ కాలనీ, భద్రాచలం

35 ఏళ్లుగా వ్యాపారం



భద్రాచలం పట్టణంలో గడిచిన 35 ఏళ్లుగా బియ్యం వ్యాపారం చేస్తున్నాం. ఎప్పటికప్పుడు మార్కెట్‌లోకి కొత్త రకం బియ్యం వస్తుంటాయి. ప్రజలను నమ్ముకునే వ్యాపారం సాగిస్తున్నాం. అధిక మొత్తంతో ఆర్డర్లు ఉంటే.. వారికి సరఫరా చేస్తుంటాం.

– రమేష్, బియ్యం వ్యాపారి, భద్రాచలం

పాఠశాలలో ఎంపీడీఓ తనిఖీ



పాఠశాలలో పరిశీలిస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ

మణుగూరురూరల్: మండల వ్యాప్తంగా ఉన్న 12 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను మణుగూరు ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు, ఎంఈఓ స్వర్ణజ్యోతి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల పరిసరాలను, మరుగుదొడ్లను, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. యూడైస్‌లో సరిగా నమోదు చేయని విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పాఠశాలల్లో పలు లోటుపాట్లను గుర్తించామని, వాటి నివేదికలు తయారు చేసి ఉన్నతాధికారులకు సమర్పించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ పి.వెంకటేశ్వరరావు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫ్లైయాష్ బ్రిక్స్ తయారీ పరిశీలన

మణుగూరురూరల్: మండల పరిధిలోని దమ్మక్కపేట గ్రామంలో బీటీపీఎస్ యాష్‌తో ఫ్లైయాష్ బ్రిక్స్ తయారీ విధానాన్ని మణుగూరు తహసీల్దార్ అద్దంకి నరేష్, ఎంపీడీఓ టి.శ్రీనివాసరావులు శనివారం సందర్శించి పరిశీలించారు. ఫ్లైయాష్ బ్రిక్స్ తయారీ విధానం గురించి తయారీదారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులు కూడా బ్రిక్స్‌ను తయారు చేశారు. ఈ బ్రిక్స్‌ను ఇందిరమ్మ ఇండ్లకు, ఇతర అభివృద్ధి కార్యక్రమాల్లో వినియోగించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



ఫ్లైయాష్ బిక్స్ తయారు చేస్తున్న అధికారులు

వేంకటేశ్వర స్వామి కల్యాణం



స్వామివారి కల్యాణం జరిపిస్తున్న పండితులు

అన్నపురెడ్డిపల్లి(చండ్రుగొండ): మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలో ఉన్న బాలాజీ వేంకటేశ్వరస్వామి కల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రసాదచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారి క్రతువు శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ఇన్‌చార్జ్ మేనేజర్ పీవీ రమణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శ్రీనివాస కల్యాణం




కల్యాణ వేడుక నిర్వహిస్తున్న వేద పండితులు

అశ్వారావుపేటరూరల్: గణపతి దీక్షదారులు, భక్తుల ఆధ్వర్యంలో శనివారం రాత్రి అశ్వారావుపేటలో పద్మావతి అలివేలుమంగ సమేత వేంకటేశ్వర స్వామి వారి తిరు కల్యాణ వేడుకలను వైభవంగా నిర్వహించారు. స్థానిక వీకేడీవీఎస్ రాజు జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వేద పడితులు, అర్చకులు కల్యాణం, పుష్ప యాగాన్ని జరిపించారు.


ఓటరు జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

ఎన్నికల ఓటర్ జాబితాపై శనివారం పలు పార్టీల ప్రతినిధులతో ఆయా ప్రాంతాల్లోని ఎంపీడీఓలు సమావేశాలు ఏర్పాటు చేశారు. సిద్ధం చేసిన ముసాయిదా ఓటర్ జాబితా, పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలు ఉంటే తెలపాలని పార్టీల నాయకులను కోరారు. వారు స్పందిస్తూ.. కొన్ని గ్రామాల్లో ఓటర్ల పేర్లు తప్పుగా ఉన్నాయని, కొన్ని ప్రాంతాల్లో కొందరి పేర్లే లేవని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. డబుల్ ఓట్లు ఉండడం, పోలింగ్ కేంద్రాలు గ్రామాలను దూరంగా ఉండడాన్ని ప్రస్తావించారు. సమస్యలను ఉన్నతాధికారులతో సమీక్షించి తుది జాబితా విడుదల చేస్తామని ఎంపీడీఓలు స్పష్టం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



పినపాక: రాజకీయ నాయకులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ సునీల్ కుమార్



ములకలపల్లి: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రామారావు



భద్రాచలంఅర్బన్: గ్రామ పంచాయతీ ఈఓకు అభ్యంతరాలు అందజేస్తున్న సీపీఎం నాయకులు

సెంట్రల్ లైటింగ్ పనులు ప్రారంభం

ములకలపల్లి: ఎట్టకేలకు సెంట్రల్ లైటింగ్ పనులు మళ్లీ షురూ అయ్యాయి. ములకలపల్లి మండలకేంద్రంలో ఫోర్‌లైన్ బీటీ రోడ్డు, డివైడర్, సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులు నెల రోజుల క్రితం అర్ధాంతరంగా పనులు ఆగిపోగా.. ఎలాగోలా శనివారం మరలా ఆరంభించారు. ఇకనైనా ఆపకుండా, నిరంతరాయంగా పనులు చేయాలని, డివైడర్‌తోపాటు, సెంట్రల్ పెండింగ్ పనులన్నీ పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

పోగొట్టుకున్న ఉంగరం, ఫోన్ అందజేత

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని గోదావరి నది ఒడ్డున ఉన్న కల్యాణ కట్ట వద్ద శనివారం హైదరాబాద్ నుంచి పుణ్యస్నానానికి సుమన్ అనే వ్యక్తి కుటుంబ సభ్యులతో కలిసి భద్రాచలం వచ్చారు. ఈ క్రమంలో కల్యాణ కట్ట వద్ద ఓ ఉంగరంతో పాటు సెల్‌ఫోన్‌ను మర్చిపోగా.. అక్కడే ఉన్న గజ ఈతగాడు ప్రసాద్ వాటిని సంబంధిత వ్యక్తులకు చేరవేశాడు.

గ్రామాల్లో వైద్యశిబిరాలు

మణుగూరురూరల్: మండల పరిధిలోని రేగులగండి, ముత్యాలమ్మనగర్, చంద్రబాబునగర్ గ్రామాల్లో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం వైద్యశిబిరాలు నిర్వహించారు. ఆయా శిబిరాల్లో వైద్యసిబ్బంది గ్రామస్తులకు వైద్యపరీక్షలు చేసి నివారణ మందులను పంపిణీ చేశారు. జ్వరంతో బాధపడుతున్న పలువురికి ర్యాపిడ్ డయాగ్నోస్టిక్ టెస్ట్ నిర్వహించారు. అనంతరం వారు గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. వైద్యసిబ్బంది రాంప్రసాద్, ఏవీ లక్ష్మి, కృష్ణ, వీరమాత, ఎంఎల్‌హెచ్‌పీ ఇందిర, సువర్ణ, శారద, నీలా, లీల, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నిమజ్జనానికి అనుమతివ్వాలి

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాల గోదావరి నదీలో వినాయక నిమజ్జనానికి అనుమతులు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరమాచినేని వినీల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మండలం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఐ వెంకటప్పయ్య, తహసీల్దార్ అశోక్ కుమార్, ఎంపీడీఓ వివేక్ రామ్‌కు విడివిడిగా వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు తెల్లం హరికృష్ణ, జిల్లా మీడియా అండ్ కమ్యూనికేషన్ చైర్మన్ కను బుద్ధి దేవా, నాయకులు సయ్యద్ మున్నా, శంకర్, కుంజా చంటి, కట్టం కృష్ణ, వాసం రాంకుమార్, సందీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్ట్

భద్రాచలంఅర్బన్: భద్రాచలం బీజేపీ నాయకులను శనివారం పట్టణ పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో ఐదుగురిని ముందస్తు అరెస్టు చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కి తరలించారు. వారిపై కేసు నమోదు చేశారు.

‘పోడు రైతులకు వెన్నుపోటు’

గుండాల: ఎన్నికల సమయంలో పోడు రైతులకు హక్కు పత్రాలు జారీ చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం.. రెండేళ్ల గడవకముందే పోడు భూముల్లో మొక్కలు నాటుతూ రైతుకు వెన్నుపోటు పొడుస్తోందని ఆళ్లపల్లి మాజీ ఎంపీపీ కొండ్రు మంజు భార్గవి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాయం నర్సింహరావులు విమర్శించారు. ఆళ్లపల్లి మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. మండలంలోని రాయిలంక, రాయిపాడు, పెద్ద వెంకటాపురం గ్రామాల్లోని పోడు భూముల్లో అటవీశాఖ అధికారులు మొక్కలు నాటుతూ బెదిరింపులకు పాల్పడుతున్నారని అన్నారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, ఆ భూముల్లో మొక్కలు నాటడం నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు బాబా, ఖయ్యూం, ఆదాం, నరెడ్ల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాఠశాల పునఃప్రారంభం

భద్రాచలంటౌన్: భద్రాచలం ఏఎంసీ కాలనీలోని గత నాలుగు ఏళ్లుగా మూతబడిన ఎంపీపీఎస్ పాఠశాలను ఎంఈఓ రమ ఆధ్వర్యంలో శనివారం ఎంపీడీఓ నారాయణ పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలని, ప్రతి ఒక్కరు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని సూచించారు. కార్యక్రమంలో బాల నర్సారెడ్డి, ఆర్.వెంకటేశ్వర్లు, అల్లాడి పాల్‌రాజు, రాజా శ్రీనివాస్, స్వాతి, ఆశాలత, రామకృష్ణ, కాలనీవాసులు సత్యవతి, జ్యోతి పాల్గొన్నారు.

దివ్యాంగులకు క్యాంప్

దుమ్ముగూడెం: కొత్తగూడెంలో ఆలింకో ఆధ్వర్యంలో జరిగే దివ్యాంగ అసెస్మెంట్ శిబిరాన్ని 18 ఏళ్ల లోపు చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ సున్నం సమ్మయ్య శనివారం సూచించారు. సెప్టెంబర్ 2న కొత్తగూడెంలోని ఆనందఖని జెడ్పీహెచ్ఎస్ స్కూల్లో జరిగే దివ్యాంగ చిన్నారుల ఉపకారణాల పంపిణీకి సంబంధించి మండలంలోని అసెస్మెంట్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరింత సమాచారం కోసం 7981104457, 9963280621నంబర్లని సంప్రదించాలని కోరారు. మండల ప్రత్యేక విద్య ఉపాధ్యాయులు జి.సతీష్, కె.రాగిణి, యు.బాబురావులు పాల్గొన్నారు.

అటవీ అధికారులపై చర్యలు తీసుకోవాలి

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాల సెక్షన్ సౌత్ బీట్ నంబర్ 58, 59 గండ్లోరిగట్ట పోడు భూముల్లో పత్తి మొక్కలను పీకిన ఫారెస్ట్ అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు యలమంచి వంశీ, మర్మం చంద్రయ్యలు డిమాండ్ చేశారు. శనివారం మొక్కలు పీకిన ఘటనపై పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇచ్చారు. ఐటీడీఏ పీఓకి పోడుపై జాయింట్ సర్వే చేయించనుండగా.. ఈలోపే ఫారెస్ట్ అధికారులు ఉద్దేశపూర్వకంగా పదేపదే దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గడ్డోరగట్ట గ్రామస్తులు మీడియం భద్రయ్య, మడకం జోగ్గయ్య, సోడి రామారావు, కనితి రాజులు, మడకం సమ్మయ్య, కురసం గోపయ్య తదితరులు పాల్గొన్నారు.

జీడీపీ వృద్ధి ఎలా సాధ్యం?



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

గుండాల: రైతులకు యూరియా అందించలేని ప్రభుత్వాలు.. దేశ జీడీపీని వృద్ధిని ఎలా సాధిస్తాయని న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గౌని ఐలయ్య, ఆవునూరి మధులు ప్రశ్నించారు. మండల కేంద్రంలో శనివారం మండల కార్యదర్శి అరెం నరేష్ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పనులు పక్కన పెట్టి యూరియా కోసం రైతులు రాత్రింభవళ్లు నిద్రాహారాలు మాని క్యూలో ఉంటున్నా.. ఒక్క యూరియా బస్తా దొరికే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇండియా ట్రైబల్ ఫోరం జాతీయ కన్వీనర్ ముక్తి సత్యం, జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సారంగపాణి, జె.సీతారామయ్య, కోరం సీతారాములు, రంగయ్య వెంకన్న, బచ్చల సారయ్య, పర్శిక రవి, ఈసం కృష్ణ, శేఖర్, గడ్డం లాలయ్య, మానాల ఉపేందర్, పెంటన్న, లాలు తదితరులు పాల్గొన్నారు.

విజయకేతనం ఎగురవేయాలి

దుమ్ముగూడెం: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగురవేసేలా కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు వీరమాచినేని వినీల్ పిలుపునిచ్చారు. శనివారం లక్ష్మీనగరం గ్రామంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో స్థానిక సంస్థల సన్నాహక ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లి ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుదారులు గెలిచే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు తెల్లం హరికృష్ణ, నటరాజ స్వామి, జిల్లా మీడియా అన్ కమ్యూనికేషన్ చైర్మన్ కను బుద్ధి దేవ, నాయకులు సయ్యద్ మున్నా, శ్రీధర్ గద్ద వెంకటేశ్వర్లు, అప్పల రెడ్డి, మద్దిరామిరెడ్డి, తోటమల్ల సంగీత తదితరులు పాల్గొన్నారు.

రహదారులు నిర్మించాలి

పినపాక: మండలంలోని ఆదివాసీ గ్రామాలకు నూతన రహదారులను నిర్మించాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అన్నవరపు కనకయ్య అన్నారు. శనివారం మండల పరిధిలోని ఆదివాసీ గ్రామాలు సుందరయ్య నగర్, భూపతిరావుపేట రహదారిని ఆయన పరిశీలించారు. సుమారు కోటిన్నర వ్యయంతో గత ప్రభుత్వంలో నిధులు మంజూరైనా.. ఇప్పటికీ రోడ్డు పనులు చేపట్టలేదని అన్నారు. కార్యక్రమంలో నిమ్మల వెంకన్న, దుబ్బా గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనంలో జాగ్రత్తలు పాటించాలి

అశ్వారావుపేటరూరల్: గణేష్ నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో స్వామి వారి విగ్రహాల నిమజ్జన కార్యక్రమాల్లో నిబంధనలతోపాటు జాగ్రత్తలు పాటించాలని అశ్వారావుపేట మున్సిపాలిటీ కమిషనర్ బి.నాగరాజు సూచించారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని వెంకమ్మ చెరువును పోలీస్, అగ్నిమాపక శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విగ్రహాల నిమజ్జనానికి వెంకమ్మ చెరువును ఎంపిక చేశామని, కావాల్సిన ఏర్పాట్లను సిద్ధం చేశామని తెలిపారు. ఎలాంటి ప్రమాదాలు, ఘర్షణలు జరగకుండా అధికారులకు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీఐ పీ నాగరాజు, ఎస్సై టి.యయాతీ రాజు, ఫైర్ ఎస్సై సైదులు, సిబ్బంది పాల్గొన్నారు.



వెంకమ్మ చెరువును పరిశీలిస్తున్న మున్సిపాలిటీ కమిషనర్, సీఐ, ఎస్సైలు

పాఠశాల వద్ద ఆందోళన

కరకగూడెం: ఉపాధ్యాయుల డిప్యూటేషన్ కారణంగా తమ పిల్లలకు సరైన విద్య అందడం లేదని వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని అనంతారం గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయురాలు కూడా డిప్యూటేషన్‌పై పాల్వంచ వెళ్లారు. దీంతో విద్యార్థులకు ఆ సబ్జెక్టులో బోధన లేకుండా పోయిందని వారి తల్లిదండ్రులు శనివారం పాఠశాల వద్ద ఆందోళన నిర్వహించారు. ఇలాంటి పరిణామాలు ప్రభుత్వ విద్యా వ్యవస్థపై తమ విశ్వాసాన్ని దెబ్బతీస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉంది. కరకగూడెం ప్రాథమిక పాఠశాలలో కూడా 30 మంది విద్యార్థులకు ఒక్క ఉపాధ్యాయుడు మాత్రమే బోధిస్తున్నారు.



కరకగూడెం: నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

ముందు హామీలు నెరవేర్చండి

అశ్వాపురం: నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చిన తరువాతే ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీఆర్ఎస్ పార్టీ మండల యువజన అధ్యక్షుడు గద్దల రామకృష్ణ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో స్థానిక బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, రాజీవ్ యువ వికాసం పథకం అమలు చేయాలని, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని, దళితులకు ఇచ్చిన హామీ అంబేడ్కర్ అభయ హస్తం రూ.12 లక్షలు ఇవ్వాలని, కుల వృత్తులకు బీసీ బంధు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు నిరుద్యోగులు, ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు.

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే



మంత్రి పొన్నంకు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

అశ్వారావుపేట/అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ శనివారం హైదరాబాద్‌లో ప్రత్యేకంగా కలిశారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అశ్వారావుపేటలో మినీ ఆర్టీసీ డిపో ఏర్పాటు చేసి.. దమ్మపేట, మండలపల్లి వద్ద ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌లను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

గణనాథుల ఊరేగింపు, నిమజ్జనం

అశ్వారావుపేటరూరల్: గణేష్ ఉత్సవాల్లో భాగంగా పలు చోట్ల ఏర్పాటు చేసిన గణనాథుల విగ్రహాలను మూడో రోజైనా శనివారం పట్టణంలోని పేరాయిగూడెం, ఫైర్ కాలనీ, డ్రైవర్స్ కాలనీతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో ట్రాక్టర్లలో ఊరేగించారు. చెరువుల్లో నిమజ్జనం చేశారు. ముందుగా మండపాల వద్ద భక్తులకు అన్నసమారాధన కార్యక్రమాలను నిర్వహించగా.. పేటమాలపల్లి వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని స్థానిక మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మొగళ్లపు చెన్నకేశవరావు ప్రారంభించారు.

చిన్నారుల నృత్యం



గణేష్ మండపం వద్ద నృత్యం చేస్తున్న చిన్నారులు

మణుగూరురూరల్: మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గణపతి పంచమ రాత్రి ఉత్సవాలను ఘనంగా జరుగుతున్నాయి. శనివారం గణనాథుడి వద్ద ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో చిన్నారులచే భరత నాట్య నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పదేళ్ల లోపు చిన్నారులు చేస్తున్న నృత్య ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి.

గణపతి పూజలో మాజీ ఎమ్మెల్యే

దమ్మపేట: మండల కేంద్రం దమ్మపేట గ్రామంలోని వినాయక మండపంలో ఉన్న గణపతికి నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు శనివారం పాల్గొన్నారు. దారా మల్లిఖార్జునరావు, దారా యుగంధర్, పసుమర్తి రామభద్రం, సాయి, ప్రదీప్ పాల్గొన్నారు.

చెరువు మరమ్మతులు చేపట్టాలి



ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతున్న మచ్చా వెంకటేశ్వర్లు, నాయకులు

దుమ్ముగూడెం: మండలంలోని నారాయణరావుపేట పంచాయతీలో గల తులసమ్మ చెరువుకు మరమ్మతులు నిర్వహించి సాగు నీరు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శనివారం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో తులసమ్మ చెరువును సందర్శించిన అనంతరం సంబంధిత ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ అధికారులను కలిసి సమస్యను తెలియజేశారు. అనంతరం మాట్లాడుతూ.. తులసమ్మ చెరువు మరమ్మతులు చేస్తే పొలురుపేట, గంగవరం, నారాయణరావుపేట గ్రామాలలోని సుమారు 700 ఎకరాలు సాగులోకి వస్తాయన్నారు. అలాగే చెరువు అలుగు పక్కన మొన్న కురిసిన భారీ వర్షాలు కారణంగా గండి పడే అవకాశాలు కనిపిస్తున్నాయని, అధికారులు వెంటనే స్పందించి ఆ మరమ్మతులు చేయించాలని కోరారు. మాజీ డీసీసీబీ చైర్మన్ యలమంచి రవికుమార్, సీపీఎం మండల కార్యదర్శి కారం పుల్లయ్య, జిల్లా కమిటీ సభ్యులు యలమంచి వంశీకృష్ణ, కొర్స చిలకమ్మా, నాయకులు బొల్లి సత్యనారాయణ, మడివి అర్జున్, సరియం సీతారామయ్య, బిల్లా ముత్యాలరావు, ముర్రం వెంకటేశ్వర్లు, కాక కామయ్య, పూజారి కామేశ్వరరావు, శీలం కన్నారావు తదితరులు పాల్గొన్నారు.